www.samasamajam.in

# సమ సమాజం

తెలుగు దిన పత్రిక

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం 17 జూన్ 2022 | ఎడిటర్: గోసుకొండ వృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-91 | పేజీలు - 4 వెల రూ. 5

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak



అందమైన బాల్యాన్ని బడిలోనే గడుపనిద్దాం,
బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం,
భావి భారత పౌరుల్ని కాపాడుకుందాం.

# రాజ్‌భవన్ ముట్టడి

# రణరంగం





- ఉద్రిక్తంగా మారిన కాంగ్రెస్ చలో రాజ్‌భవన్
- ఖైరతాబాద్‌లో టూ వీలర్ దగ్ధం.. బస్సు అద్దాలు ధ్వంసం
- కాంగ్రెస్ కార్యకర్తలను ఎక్కడికక్కడే అడ్డుకున్న పోలీసులు
- రాజ్‌భవన్ వెళుతుండగా రేవంత్ తదితరుల అరెస్ట్
- తనను అడ్డుకున్న పోలీస్ కాలర్ పట్టుకున్న రేణుకా చౌదరి

**హైదరాబాద్, జూన్ 15 (సమ సమాజం):** రాహుల్ గాంధీపై ఈడీ విచారణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ చేపట్టిన చలో రాజ్‌భవన్ ఉద్రిక్తంగా మారింది. టీపీసీసీ పిలుపునిచ్చిన ఛలో రాజ్ భవన్ కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. ఖైరతాబాద్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు స్కూటీకి నిప్పుపెట్టడంతో పాటు బస్సుల అద్దాలను ధ్వంసం చేశారు. అంతేగాకుండా బస్ ఎక్కి ఆందోళన చేశారు. రాజ్ భవన్ వైపు వెళ్లకుండా పోలీసులు భారీ కేడ్లు ఏర్పాటు చేశారు పోలీసులు. వాటిని తోసుకుని కాంగ్రెస్ నేతలు రేవంత్ రెడ్డితో పాటు పలువురు నేతలు పరుగెత్తారు. వారిని అడ్డుకునే క్రమంలో పోలీసులకు కాంగ్రెస్ శ్రేణులకు మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో రేవంత్ రెడ్డి, జగ్గారెడ్డి, గీతారెడ్డి, శ్రీధర్ బాబు, అంజన్ కుమార్ లను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు. రేవంత్ రెడ్డి అరెస్ట్‌తో పాటు వందలాదిగా తరలి వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. వారిపై పోలీసులు లాఠీ చార్జ్ చేయడంతో పలువురికి గాయలయ్యాయి. పోలీసుల తీరుపై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. రాహుల్ గాంధీని ఈడీ విచారణ పేరుతో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు గురి చేస్తున్నారంటూ రాజ్ భవన్ ముట్టడికి పిలుపునిచ్చింది. దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజ్ భవన్ ముందు బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు.. ఐడీ కార్డు ఉంటేనే రాజ్ భవన్ సిబ్బందిను కూడా లోపలకి అనుమతించారు. మరో వైపు రాజ్ భవన్ ముట్టడికి పిలునివ్వడంతో కాంగ్రెస్ నేతలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. రాష్ట్రంలో పోలీసుల రాజ్యం నడుస్తోందని ఫైర్ అయ్యారు. పోలీసులు తమని రెచ్చగొట్టం వల్లే వాహనాలను

2

## నన్నే టచ్ చేస్తావా.. నీ స్టేషన్‌కొచ్చి కొడతా

- చేయివేస్తే పార్లమెంట్ దాకా ఈడ్చుకెళతా
- పోలీస్ అధికారిపై ఫైర్‌బ్రాండ్ రేణుకాచౌదరి ఆగ్రహం



**హైదరాబాద్, జూన్ 15 (సమ సమాజం):** 'నన్నే పట్టుకుంటావా.. స్టేషన్‌కు వచ్చి మరీ కొడతా' అంటూ పోలీసు అధికారిపై మాజీ కేంద్రమంత్రి రేణుకాచౌదరి తీవ్రంగా ఫైర్ అయ్యారు. 'నాపై చేయి వేస్తే పార్లమెంట్ వరకు ఈడ్చుకెళ్తా' అని హెచ్చరించారు. అనంతరం రేణుకా చౌదరిని పోలీసులు వాహనంలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ దృశ్యాలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మాజీ కేంద్రమంత్రి, ఫైర్ బ్రాండ్ రేణుకా చౌదరి కన్నెర్ర చేశారు. ఒక్కసారిగా శివంగిలా మారిపోయారు. ఛలో రాజ్‌భవన్‌లో పోలీసులకు చుక్కలు చూపించారు. అరెస్టు చేసేందుకు యత్నించిన ఖాకీలను ఖబడ్దార్ అంటూ హడలె త్తించారు. మహిళా

2

## బాసరలో కొనసాగుతున్న ఆందోళన

- పలువురు ఆందోళనకు మద్దతు
- మద్దతు తెలపడానికి వచ్చినవారి అరెస్ట్
- మంచినీటి సరఫరా నిలిపివేసిన అధికారులు
- సోషల్ మీడియా వేదికగా విద్యార్థుల సందేశాలు



**నిర్మల్, జూన్ 15 (సమ సమాజం):** బాసర ట్రిపుల్ ఐటిలో విద్యార్థుల ఆందోళన మూడోరోజు గురువారం కూడా కొనసాగింది. మెయిన్ గేటు ఎదుట విద్యార్థులు నిరసన చేపట్టారు. దీంతో విద్యార్థులు గేటు వైపు దూసుకు రాకుండా పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో ఆర్‌జీయూకేటీ రెండో గేటు ఎదుట విద్యార్థులు బైఠాయించారు. మద్దతుగా వచ్చిన విద్యార్థుల కుటుంబసభ్యులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 12

2

## తొలగించిన ఆసరా పెన్షన్లు ఇవ్వాల్సిందే

- సిఎం కెసిఆర్‌కు బండి సంజయ్ బహిరంగలేఖ



**హైదరాబాద్, జూన్ 15 (సమ సమాజం):** ఆసరా ఫించన్ల జాబితా నుంచి తొలగించిన వారికి వెంటనే న్యాయం చేయాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం 13లక్షల మందిని జాబితా తొలగించి వారికి అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. ఆసరా

2

## ఆ విమర్శలపై ఎందుకు స్పందించరు

- ట్విట్టర్ వేదికగా ప్రధానికి కెటిఆర్ ప్రశ్న



**హైదరాబాద్, జూన్ 15 (సమ సమాజం):** ప్రధాని నరేంద్ర మోదీ, పారిశ్రామికవేత్త అదానీని విమర్శిస్తూ రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్ష నేతలను కేంద్రం టార్గెట్ చేయడం సాధారణమే అని కేటీఆర్ తన

2

## అగ్నిపథ్‌పై యువత ఆందోళన

**హైదరాబాద్, జూన్ 15 (సమ సమాజం):** రక్షణశాఖలో సైనిక నియామకాల కోసం కేంద్రప్రభుత్వం ప్రకటించిన 'అగ్నిపథ్' రిక్రూట్‌మెంట్‌కు వ్యతిరేకంగా బీహార్ యువత కదం తొక్కింది. రాష్ట్రంలో వరుసగా రెండో రోజూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. నవాడ, జహానాబాద్, ముంగర్, ఛాప్రాలో పెద్దఎత్తున యువత రోడ్లు ఎక్కారు. అర్రాహ్ రైల్వే స్టేషన్ వద్ద నిర్వహించిన ధర్నా కాస్తా హింసాత్మకంగా మారింది. ఆందోళన కారులను అదుపుచేయడానికి పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. నిరసన కారులు రైల్వే ట్రాక్‌పై టైర్లు, కర్రలు ఉంచారు. దీంతో రైళ్ల రాకపోకలు అంతరాయం కలిసింది. రైల్వే స్టేషన్‌లో ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు.

## ఈ ఏడాదిలోనే అన్ని ఉద్యోగ ఖాళీల భర్తీ

- ఈ నెలలోనే గ్రూప్ 4 ఉద్యోగాల నోటిఫికేషన్
- స్థానికులకు 95 శాతం ఉద్యోగాలు దక్కేలా నిర్ణయం
- పోలీస్ ఉద్యోగాల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్
- పరిగిలో ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్, జూన్ 15 (సమ సమాజం):** ఈ ఏడాదిలోనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలు భర్తీ చేస్తామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్ రావు అన్నారు.. 9200 గ్రూప్ 4 ఉద్యోగాల నోటిఫికేషన్ ఈ నెలలో ఉంటుందన్నారు. అందరూ అన్ని పోస్టులకు పరీక్ష రాసేందుకు వీలుగా ఒక దాని తర్వాత మరొక నోటిఫికేషన్ ఇస్తున్నామని తెలిపారు. వికారాబాద్ జిల్లాలో మంత్రి గురువారం పర్యటించారు. ఇందులో భాగంగా పరిగిలో స్థానిక ఎమ్మెల్యే అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. అనంతరం హరీష్ రావు మాట్లాడుతూ..రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను ఈ సంవత్సరంలో భర్తీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మన ముఖ్యమంత్రి కేసీఆర్ 95 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కేలా చేశారు. పట్టు బట్టి, ఢిల్లీ పోయి కేంద్రాన్ని ఒప్పించారని హరీష్ వ్యాఖ్యనించారు. 33 శాతం పోలీసు ఉద్యోగాలు మహిళలకు సీఎం కేసీఆర్ కల్పించారని మంత్రి వెల్లడించారు. మొన్న సివిల్స్‌లో ర్యాంకులు సాధించిన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. లక్ష్యం సిద్ధించాలంటే, చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. బాగా చదివి తల్లిదండ్రుల పేరు

2

## ప్రెస్ కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయి



**న్యూఢిల్లీ, జూన్ 15 (సమ సమాజం):** ప్రెస్ కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయి (72) నియమితులు కానున్నారు. ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాలతో కూడిన ఎంపిక సంఘం మంగళవారం ఆమె పేరును సిఫార్సు చేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీనిపై త్వరలో అధికారిక ప్రకటన విడుదల కానుంది. గతంలో బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన ఆమె ఇటీవల వరకు జమ్మూ-కశ్మీర్ నియోజకవర్గాల పునర్విభజన కమిటీ అధ్యక్షురాలిగా వ్యవహరించారు. ఇంతకుముందు వరకు ప్రెస్ కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన జస్టిస్ చంద్రమౌళి కుమార్ ప్రసాద్ పదవీ కాలం నిరుడు నవంబరులోనే ముగిసింది. అప్పటి నుంచి ఈ పదవి ఖాళీగా ఉంది.

## సర్కారీ బడుల బలోపేతానికి చర్యలు

### మనబడి కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్ మల్కాజిగిరి,జూన్16(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు దేశానికే ఆదర్శంగా నిలుస్తాయని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మన పట్టణం-మన బడి కార్యక్రమాన్ని గురువారం పోచారం మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ బి.కొండల్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను సీఎం కేసీఆర్ అభివృద్ధి చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

2

## హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో భారీగా బదిలీలు

### లాంగ్ స్టాండింగ్ ఉన్న వాళ్లకు స్థానచలనం




**హైదరాబాద్, జూన్ 15 (సమ సమాజం):** హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో భారీగా బదిలీలకు కమిషనర్ సీవీ ఆనంద్ శ్రీకారం చుట్టారు. ఒకేచోట ఐదారేళ్లుగా పాతుకుపోయిన పోలీసులను బదిలీలతో స్థానచలనం కలిగించారు. ఈ సందర్భంగా కమిషనరేట్ పరిధిలో 2,865 మంది పోలీసుల బదిలీలె జరిగాయి. ఇందులో కానిస్టేబుళ్లు 2006, హెడ్‌కానిస్టేబుల్లు 640, ఏఎస్సైలు 219 మంది బదిలీ అయ్యారు. గత రెండేళ్ల క్రితమే బదిలీలు జరగాల్సిందని, కానీ కొవిడ్ కారణంగా రెండేళ్లుగా బదిలీలను నిలిపి వేశారు. తాజాగా కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్ బదిలీలకు ఉపక్రమించారు. ఐదారేళ్లుగా లాంగ్ స్టాండింగ్ లో ఉన్న ప్రతిఒక్కరి పై బదిలీ వేటు పడింది. ఈసందర్భంగా పలువురిని బదిలీ చేస్తూ సీపీ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

## సంపాదకీయం

### కెసిఆర్ లాఠీకి దెబ్బలెక్కువ !

ప్రాజెక్టులే కావచ్చు..పరిశ్రమలే కావచ్చు.. వాటికి ఇచ్చే భూముల కోసం ప్రజలు త్యాగాలు చేయాల్సిందే ! తన్నులు తినాల్సిందే.. సర్వం కోల్పోయి రోడ్డున పడాల్సిందే..దేశంలో అప్పుడూ..ఇప్పుడూ..ఇదే జరుగుతోంది. భూసేకరణ అనగానే లాఠీలు విరగాల్సిందే! ప్రజల వీపులు పగలాల్సిందే.! బలవంతంగా భూములు గుంజుకోవాల్సిందే.. రైతులను, ప్రజలను మోసం చేసి బలవంతం భూసేకరణ చేయాల్సిందే.. దేశం యావత్తూ ఇదే తంతు జరుగుతోంది. మూటాముల్లె సర్దుకుని ప్రభుత్వం వారిచ్చిన జాగాల్లో మళ్లీ గుడిసెలు వేసుకోవడం ..తమ మానాన తాము బతకడం అలవాటుచేసుకోవాల్సిందే. ప్రాజెక్టులు కట్టుకుని.. కంట్రాక్టర్లకు దోచిపెట్టిన పాలకులు భూములిచ్చిన రైతుల త్యాగం మరువలేనిదని ఓ నిట్టూర్పు మాటతో తమ బాధ్యతను విస్మరిస్తున్నారు. ప్రజలకోసం..ప్రజల ఆకాంక్షల మేరకు..ప్రజల బాగు కోసం ఏర్పడ్డ తెలంగాణలో కూడా ఇందుకు పరిస్థితి భిన్నంగా లేదు. ఇక్కడా కాంట్రాక్టర్లకు మేలు జరిగిందే తప్ప రైతులకు, ఊళ్లు వదిలిన ప్రజలకు ఎక్కడా మేలు జరగలేదు. మాటలు మాత్రం తీయగా చెప్పి వారిని మోసపుచ్చి భూములు గుంజుకోవడమే జరిగింది. కెసిఆర్‌ను ప్రజలంతా బాగా నమ్మారు. దగాపడ్డ తెలంగాణలో కన్నా ఇప్పుడు తమ బతుకు బాగుపడతాయని భావించారు. ప్రాజెక్టులు కడితే వారికి పరిహారంతో పాటు ఆవాసం మంచిగా ఇస్తారని భావించారు. భూములకు భూములు ఇవ్వకున్నా మరోచోట ఎకరానికి అర ఎకరమైనా కొనుక్కునే వీలు కలిగేలా పరిహారం ఇస్తారని భావించారు. కానీ కెసిఆర్ కూడా మిగతా ప్రభువులకన్నా తక్కువేమీ తినలేదని నిరూపించుకున్నారు. మల్లన్న సాగర్ కావచ్చు..కొండపోచమ్మ కావచ్చు..గౌరవెల్లి కావచ్చు..భూములు ఇచ్చి,గ్రామాలను నీటిలో ముంపునకు వదులుకున్న ప్రజలు మాత్రం అష్టకష్టాలు పడుతున్నారు. తెలంగాణలో ఇంత దారుణంగా భూసేకరణ జరుగుతందని బహుశా ఎవరు కూడా ఊహించలేదు. లక్షల కోట్లు అప్పు చేస్తున్న ప్రభుత్వం సామాన్య రైతులకు, ప్రజలకు ఇంత దగా చేస్తుందని ఎవరూ అనుకోలేదు. నిజానికి భూములు ఇచ్చిన రైతులకు, ముంపు గ్రామాల ప్రజలకు గౌరవ ప్రదమైన జీవితం గడిపేలా చేయాలి. కానీ మాటల్లో ఇవన్నీచేసి..లాఠీలతో దెబ్బలు కొట్టించి, బూటుకాళ్లతో తన్నులు తినిపంచి..అంతా బాగుందని ప్రచారం చేసుకోవడం ఉద్యమ నేతగా చెప్పుకుంటున్న కెసిఆర్‌కు మంచిదా అని ఆలోచించాలి. ప్రజల శాపనార్థాలు ఎప్పుడూ మంచిది కాదు. వారి వేదనాభరిత జీవితంలో నుంచి వచ్చే తిట్టు కావచ్చు..ఏడుపులు కావచ్చు..ఎప్పుడో ఒకప్పుడు దహించక మానవు. నిజానికి పథకాల పేరుతో ఓట్ల వేటలో పడి పప్పు బెల్లాలకు పందేరం చేసే బదులు భూసేకరణలో సర్వం కోల్పోతున్న వారికే అగ్రతాంబూలం ఇవ్వాలి. వారికే ఓ రూపాయి ఎక్కువ ముట్టచెప్పాలి. అలా కాకుండా చేయడం వల్లనే ఇవాళ ప్రాజెక్టుల్లో భూములను, ఇళ్లను కల్పోతున్నవారు కన్నీరు పెట్టుకుంటున్నారు. రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. తెలంగాణలో భూమలు ధరలు పెరిగాయని, ఎక్కడా 30,35 లక్షలకు తక్కువ ఎకరం లేదని పదేపదే వల్లె వేస్తున్న కెసిఆర్ వీరికి ఆమేరకు పరిహారం ఇచ్చారా అన్నది ఆలోచించాలి. వారని హృదయవేదన వినాలని ఏనాడైనా కనీసం ఆలోచించి ఉంటే వారికి ఈ కష్టాలు వచ్చేవి కావు. తానూ ఓ సామాన్యుడిగానే ఇవాళ తెలంగాణ సిఎంగా ఎదిగానని ఆలోచించి ఉంటే వారికి కష్టాలు, కన్నీళ్లు, లాఠీల దెబ్బలు తినాల్సి వచ్చేది కాదు. కోర్టుల చుట్టూ పరిహారం కోసం తిరగాల్సి వచ్చేది కాదు. జైళ్లకు వెళ్లాల్సి వచ్చేది కాదు. తాజాగా గౌరవెల్లి నిర్వాసితుల గోడు అలాంటి వేదనాభరిత కథగానే చూడాలి. రాజకీయ లబ్ది కోసమే కాంగ్రెస్, బీజేపీ గౌరవెల్లి ప్రాజెక్టును అడ్డుకొనే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలు ఫక్తు రాజకీయ నింద తప్ప మరోటి కాదు. తానో గొప్ప ట్రబుల్ షూటర్ అని చెప్పుకునే లేదా చెప్పించుకునే హరీష్ రావుకు తెలంగాణ నేపథ్యం తెలియనిదా.. గౌరవెల్లి రిజర్వాయర్ సంఘటనపై ఎందుకు ఆందోళన జరుగుతుందో తెలియదా ? హుస్నాబాద్ ప్రాంత రైతాంగానికి నీళ్లు రావొద్దని ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని విమర్శించడం ద్వారా సమస్యను పక్కదారి పట్టించే నాయకుడిగానే ఆయన మాట్లాడారు. రాజకీయనేతగానే మాట్లాడారు తప్ప రైతుల కన్నీరు తెలిసిన నేతగా మాట్లాడడం లేదు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ జలాశయం పనులను ఇలాగే అడ్డుకొన్నారని, ప్రజలను రెచ్చగొట్టి అధికారులపై తిరగపడేలా చేసి తప్పుకొన్నారని ఆరోపించడంలో నిజంలేదు. అలా కాకుండా ప్రతిపక్షాల ట్రాప్‌లో పడొద్దని గౌరవెల్లి నిర్వాసితులకు మంత్రి హితవు పలికిన తీరు చూస్తే..సమస్యను వారి కోణంలో చూడడం లేదని అర్థం అవుతోంది. బాధితులతో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని , 2013 పునరావాస చట్టం ప్రకారం ప్రతి నిర్వాసితుడికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం కాదు..ఇచ్చి తీరాలి. బాధితుల జాబితా ముందు పెట్టుకుని మంత్రి హరీష్ రావు ఒక్కో బాధితుడితో నిజాయితీగా మాట్లాడాలి. నిర్వాసితుల విషయంలో ప్రభుత్వం సానుభూతితో కాకుండా బాధ్యతగా, వారి హక్కుగా ఆలోచించాలి. హుస్నాబాద్ నియోజకవర్గానికి గోదావరి జలాలు రాకుండా చేయటమే కాంగ్రెస్, బీజేపీ లక్ష్యమని చెప్పడంలో ఎలాంటి లాజిక్కు లేదు. ఒక మంచి జరిగితే ప్రజలు స్వచ్ఛందంగా సహకరించేందుకు సిద్ధంగా ఉంటారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తయితే లక్ష కుటుంబాలు లాభపడతాయని చెప్పడం కాకుడా చేతల్లో చూపాలి. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ బాధితుల గాధలను కూడా వినాలి. అధికారుల నివేదికలు, సమాధానాలతో పాటు బాధితుల గోడుకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా తెలంగాణ ఆకాంక్షలకు అద్దం పట్టాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

## రాజ్‌భవన్ ముట్టడి రణరంగం

(మొదటి పేజీ తరువాయి..) ధ్వంసం చేశారమన్నారు . ఘర్షణలో కొందరు సంఘవిద్రోహ శక్తులు చేరి తమ పార్టీని దెబ్బతీసే కుట్ర చేశారన్నారు. కాంగ్రెస్ నేతల ధర్నాతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వాహనాలు కిలోమీటర్ కొద్ది నిలిచిపోయాయి. నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ మహిళా కార్యకర్తలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తనను అడ్డుకున్న పోలీసులతో రేణుకా చౌదరి వాగ్వాదానికి దిగింది. ఓ పోలీసు కాలర్ ను పట్టుకుంది. దీంతో ఆమెను పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ క్రమంలో నగరంలోని ఖైరతాబాద్‌లో కాంగ్రెస్నేతల ఆందోళనలు ఉద్రిక్తతకు దారి తీసింది. రోడ్డుపై యువజన కాంగ్రెస్ నేతలు బైక్‌కు నిప్పు పెట్టారు. బస్సులను అడ్డుకుని నిరసనకు దిగారు. ఆర్టీసీ బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. యూత్ కాంగ్రెస్ నేత అనిల్ కుమార్ యాదవ్ ఆర్టీసీ బస్ ఎక్కి నిరసన తెలిపారు. కాంగ్రెస్ నేతల ఆందోళనలతో ఖైరతాబాద్‌లో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఈ క్రమంలో ఖైరతాబాద్ సర్కిల్ వద్దకు కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా చేరుకుంటున్నారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలు రాజ్‌భవన్‌కు వెళ్ళకుండా బారికేడ్లను అడ్డుపెట్టారు. అయితే ఎట్టి పరిస్థితుల్లో రాజ్‌భవన్ వద్ద నిరసన తెలుపుతామని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు స్పష్టం చేశారు.

### నన్నే టచ్ చేస్తావా.. నీ స్టేషన్‌కొచ్చి కొడతా

(మొదటి పేజీ తరువాయి..) నేతలతో వచ్చిన రేణుకను పోలీసులు అడ్డగించారు. అరెస్టు చేసే క్రమంలో ఓ మహిళా పోలీస్ రేణుకను పట్టుకునేందుకు యత్నించారు. అంతే ఆమెపై కన్నెర్ర చేశారు. 'తనను టచ్ చేస్తే ఖబడ్దార్' అంటూ వార్నింగ్ ఇచ్చారు. అంతటితో ఆగని రేణుకా చౌదరి ఎస్ఐ కాలర్ పట్టుకున్నారు. నన్నే అరెస్టు చేస్తారా? అంటూ రచ్చ రచ్చ చేశారు. రేణుకా తీరుతో పోలీసులు ఒకింత భయపడ్డారు. భట్టి విక్రమార్క, రేణుకా చౌదరిపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. నేతల అరెస్టులను నిరసిస్తూ పంజాగుట్టలో టీ కాంగ్రెస్ నేతలు ఆందోళనకు దిగారు. గోషామహల్ స్టేడియానికి భట్టి, రేణుకా, జగ్గారెడ్డిలను తరలించిన పోలీసులు స్టేడియంవద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్టేడియంలోకి ఎవరూ వెళ్లకుండా గేట్లు మూసేశారు. మరోవైపు టీపీసీసీ రేవంత్ రెడ్డిని బొల్లారం పీఎస్‌కు తరలించారు. రాజ్‌భవన్ ముట్టడి ఉధృతంగా మారింది. పోలీసులు, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో పోలీసులు కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ అరెస్టు చేసి స్థానికంగా ఉండే పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోలీసులు తనను రెచ్చగొట్టి, దుర్భాషలాడారని రేణుకా చౌదరి అన్నారు. అందుకే ఎస్ఐ చొక్కా పట్టుకున్నట్లు ఆమె తెలిపారు. పోలీసులు సజావుగా వ్యవహరించి ఉంటే ఇలాంటి చర్యలు జరిగేవికావని ఆమె అన్నారు. మొత్తంమీద కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు.

## ఈ ఏడాదిలోనే అన్ని ఉద్యోగ ఖాళీల భర్తీ

(మొదటి పేజీ తరువాయి..) తేవాలని..వారి ఆశలు నిలబెట్టాలని మంత్రి హరీష్ రావు విద్యార్థులకు వివరించారు. తెలంగాణ వచ్చిన తర్వాత 1.35 లక్షల ఉద్యోగాల నియామకం పూర్తిచేశామని హరీశ్‌రావు తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మరో 91 వేల ఉద్యోగాలను ప్రకటించారని, అందులో ఇప్పటికే 35 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వచ్చాయని చెప్పారు. త్వరలోనే మరో 9,200 గ్రూప్-4 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు రాబోతున్నాయని పేర్కొన్నారు. ఏడాదిలోపే ఈ ఉద్యోగాలన్నీ భర్తీచేస్తామని స్పష్టంచేశారు. ఇక నుంచి ఏటా ఉద్యోగ క్యాలెండర్‌ను రూపొందించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్ ఆదేశించినట్టు వెల్లడించారు. పోలీస్ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. అన్ని ఉద్యోగాల్లో స్థానికులకు 95 శాతం రిజర్వేషన్ ఇస్తున్నామని తెలిపారు. ఉద్యోగార్థులు చిత్తశుద్ధితో చదివి లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. కొన్నిరోజులు సోషల్ మీడియాకు దూరంగా ఉండి, తాత్కాలిక ఆనందాలు పక్కకుబెట్టి దీర్ఘకాలిక లక్ష్యం కోసం ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపి రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### తొలగించిన ఆసరా పెన్షన్లు ఇవ్వాల్సిందే

(మొదటి పేజీ తరువాయి..) పథకం కింద కొత్త పింఛన్లు, తొలగించిన పింఛన్ లబ్దిదారుల పేర్లను మళ్లీ జాబితాలో వెంటనే చేర్చి.. వారికి నిధులు మంజూరు చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఆసరా పింఛన్లపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన బహిరంగలేఖలో పేర్కొన్నారు. ఆసరా పింఛన్ల అంశంపై మండల, జిల్లా,రాష్ట్ర స్థాయిలో అన్ని రాజకీయ పార్టీలు సామాజిక సంస్థలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయితీ మున్సిపాలిటీలలో ఆసరా పింఛన్ లబ్ధిదారులు పెండింగ్ దరఖాస్తుదారుల జాబితాను బహిరంగంగా నోటీస్ బోర్డుపై ఉంచాలని తెలిపారు. 2014 నుంచి 2022 వరకు ప్రభుత్వం 13లక్షల మంది ఆసరా పింఛన్ లబ్దిదారులను తొలగించిందని బండి ఆరోపించారు. అర్హులైన 13లక్షల మంది పింఛన్‌దారులను తొలగించడం వల్ల ప్రభుత్వం ప్రతీ ఏడాది 3వేల కోట్లను ఆదా చేసుకుంటోందని విమర్శించారు. వీరిని వెంటనే జాబితాలో చేర్చి న్యాయం చేయాలని భాజపా అధ్యక్షుడు డిమాండ్ చేశారు.

## బాసర ట్రిపుల్ ఐటి విద్యార్థులకు మద్దతు

ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన బిజెవైఎం

**హైదరాబాద్, జూన్ 15 (సమ సమాజం):** బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర కార్యాలయం ప్రధాన రహదారిపైయువ మోర్చా నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భాను ప్రకాష్ మాట్లాడుతూ... బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు తమ సమస్యలను పరిష్కరించాలని పోరాటం చేస్తున్నారన్నారు. 6 వందల మంది విద్యార్థులు 12 డిమాండ్లతో పోరాటం చేస్తుంటే.. విద్యాశాఖ మంత్రి సిల్లీ సమస్యలంటూ ఎగతాళి చేశారని మండిపడ్డారు. తక్షణమే విద్యాశాఖ మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను చర్చల పేరుతో బెదిరింపులకు గురి చేసిన నిర్మల్ జిల్లా కలెక్టర్‌ను తొలగించాలన్నారు. ప్రభుత్వం తక్షణమే సమస్యలను పరిష్కరించాలని అన్నారు. లేనిపక్షంలో రేపటి నుంచి బాసరకు వెళ్లి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని భానుప్రకాష్ స్పష్టం చేశారు.


## ట్రిపుల్ ఐటీ నూతన డైరెక్టర్‌గా ప్రొఫెసర్ సతీష్ కుమార్

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం

**నిర్మల్, జూన్ 15 (సమ సమాజం):** బాసర ట్రిపుల్ ఐటీ వద్ద విద్యార్థుల ఆందోళన కొనసాగుతోంది. వీరి నిరసనల మధ్యే ట్రిపుల్ ఐటీ నూతన డైరెక్టర్‌గా ప్రొఫెసర్ సతీష్ కుమార్ నియామకం జరిగింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డైరెక్టర్ నియామకంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కాగా తమ డిమాండ్ల విషయంలో వెనక్కి తగ్గేది లేదని వెల్లడించారు. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని విద్యార్థులు స్పష్టం చేశారు. గత మూడ్రోజులుగా వివిధ సమస్యలపై విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ విద్యార్థులు నిరసనలు చేస్తున్న విషయం తెలిసిందే. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి, కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వారు శాంతించలేదు. 12 డిమాండ్లతో విద్యార్థులు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. విద్యార్థులు గేటు వైపు దూసుకురాకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. బారికేడ్లను ఏర్పాటు చేశారు. మరోవైపు ఆందోళన చేస్తున్న విద్యార్థుల పట్ల అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. వారికి తాగునీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో నీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఉస్మానియా యూనివర్సిటీ ఎలక్ట్రానిక్స్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ సతీష్ కుమార్‌ను ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ గా నియమించింది. డైరెక్టర్ నియామకంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. వీసీ వల్లనే ఏం కాలేదు... డైరెక్టర్ ఏం చేస్తారంటూ విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. తమ డిమాండ్ల విషయంలో వెనక్కి తగ్గేది లేదని వెల్లడించారు. సీఎం కేసీఆర్ లేదా కేటీఆర్ నుంచి స్పష్టమైన హామీ వస్తే తప్ప తమ ఆందోళనను విరమించేదిలేదని విద్యార్థుల తేల్చి చెప్పారు.కాగా... 12 డిమాండ్లతో బాసర ట్రిపుల్ ఐటీ మెయిన్ గేటు వద్ద గత మూడు రోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. విద్యార్థులు గేటు వైపు దూసుకురాకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. బారికేడ్లను ఏర్పాటు చేశారు. మరోవైపు ఆందోళన చేస్తున్న విద్యార్థుల పట్ల అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. వారికి తాగునీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో నీరు లేక విద్యార్థులు ఇబ్బందులకు లోనవుతున్నారు. ఈ విధంగా తమపై ఒత్తిడి తెస్తున్నారంటూ స్టూడెంట్స్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా క్యాంపస్ ఎస్పీ కంట్రోల్‌లో ఉంది... తాగునీరు, విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించాలి' అని విద్యార్థులు ట్వీట్ చేశారు. ంత్రి సబితారెడ్డి వ్యాఖ్యలపై విద్యార్థుల ఆగ్రహంవిద్యార్థుల ఆందోళనపై మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేసి వ్యాఖ్యలపై బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమవి సిల్లీ డిమాండ్లు అని మంత్రి పేర్కొనడం దారుణమన్నారు. 'హైదరాబాద్‌లో ఉండి మాట్లాడటం కాదు... ఇక్కడికి వచ్చి చూడాలి' అంటూ వ్యాఖ్యలు చేశారు. జిల్లా కలెక్టర్ తీరు బాగోలేదని, చర్చలకు పిలిచి బెదిరించారని విద్యార్థులు తెలిపారు. ఈ క్రమంలో బాసర ట్రిపుల్ ఐటీ నూతన డైరెక్టర్‌గా ప్రొఫెసర్ సతీష్ కుమార్ నియామకం అయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## ఉన్న పనిని వదిలి గాడిదలు కాస్తున్నాడు

కర్నాటకలో ఓ టెక్కీ వినూత్న వ్యాపారం



**బెంగళూరు, జూన్ 15 (సమ సమాజం):** పనీపాటా లేకుండా జులాయిగా తిగిఏ వాడిని ఏరా గాడిదలు కాస్తున్నావా? అంటూ ఎగగతాళి చేస్తాం. కానీ ఉన్న పనిని వదిలి పెట్టిన టెక్కీ ఏకంగా గాడుదలనే కాస్తున్నాడు. కర్ణాటక మంగళూరులోని 42 ఏళ్ల శ్రీనివాస గౌడ గురించి తెలిస్తే మాత్రం ఇకపై అంతా గాడిదలు కాసే పనిలోకి దిగడం ఖాయం. అందరికీ విభిన్నంగా ఆలోచించి దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచారు శ్రీనివాస గౌడ. సాఫ్ట్‌వేర్ కొలువును వదులుకుని.. దక్షిణ కన్నడ జిల్లాలోని ఓ గ్రామానికి వెళ్లి జూన్ 8వ తేదీన గాడిదలను పెంచేందుకు వ్యవసాయ క్షేత్రాన్ని తెరిచారు. కర్నాటకలో గాడిదలను పెంచడం ఇదే మొదటిది కాగా.. దేశంలో ఇది రెండవది. గతంలో కేరళలోని ఎర్నాకుళం జిల్లాలో గాడిదల పెంపకం కోసం ఓ వ్యవసాయ క్షేత్రాన్ని ప్రారంభించారు. పట్టభద్రుడైన శ్రీనివాస గౌడ 2020లో ఐటీ ఉద్యోగం మానేసిన తర్వాత ఇరా గ్రామంలో.. 2.3 ఎకరాల స్థలంలో సమగ్ర వ్యవసాయం, పశుసంవర్ధక, పశువైద్య సేవలు, శిక్షణ, పశుగ్రాసం అభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ క్షేత్రంలోనే మేకల పెంపకాన్ని ప్రారంభించారు. అనంతరం కుందేళ్లు, కడక్‌నాథ్ కోళ్ల పెంపకాన్ని చేపట్టారు. తాజాగా 20 గాడిదలతో వ్యవసాయ క్షేత్రాన్ని ప్రారంభించారు. గాడిదల పెంపకం ఆలోచన చెప్పినప్పుడు చాలామంది ఎగతాళి చేశారంటున్న శ్రీనివాస గౌడ గాడిద పాలు రుచికరమైనవే కాకుండా చాలా ఖరీదైనవని చెబుతున్నారు. గాడిద పాలు చాలా ఔషధ విలువలను కలిగి ఉంటాయని వివరిస్తున్నారు. ప్యాకెట్ల ద్వారా గాడిద పాల సరఫరా చేపడతామంటున్న శ్రీనివాసగౌడ 30 మిల్లీలీటర్ల పాలప్యాకెట్ ధర రూ.150గా ఉంటుందని చెబుతున్నారు. మాల్స్, షాపులు, సూపర్ మార్కెట్ల ద్వారా సరఫరా చేస్తామని చెప్పారు. బ్యూటీ ఉత్పత్తుల కోసం కూడా గాడిద పాలను విక్రయించేందుకు శ్రీనివాస గౌడ ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. 17 లక్షల విలువైన ఆర్డర్లు ఇప్పటికే వచ్చాయని ఆయన చెప్పారు.

### ఓయూలో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

**హైదరాబాద్, జూన్ 15 (సమ సమాజం):** ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రంలోని బీజేపీ పాలనా విధానంపై ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు ఆగ్రహించారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటు పరం చేస్తూ అదాని గ్రూపు సంస్థల వంటి వాటికి అమ్ముకుంటున్నారని ఆరోపిస్తూ మోడీకి వ్యతిరేకంగా ఇవాళ ఓయూలో విద్యార్థుల నిరసనకు దిగారు. టీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు తుంగ బాలు ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రధాని మోది దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

## సర్కారీ బడుల బలోపేతానికి చర్యలు

(మొదటి పేజీ తరువాయి..) ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీ, అదనపు గదుల నిర్మాణం, మధ్యాహ్న భోజన షెడ్లు తదితర మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం7,300 కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. తెలంగాణను ప్రగతి పథంలో నిలిపేందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి చెప్పారు. పోచారం మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాలలో మన పట్టణం- మన బడి కార్యక్రమంలో భాగంగా కోటి ఇరవై మూడు లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సురేష్, వైస్ చైర్మన్ రెడ్యా నాయక్, కౌన్సిలర్లు రాజశేఖర్, పోచమ్మ, సాయిరెడ్డి, శైలజ, బాల్‌రెడ్డి, మేనేజర్ నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

### ఆ విమర్శలపై ఎందుకు స్పందించరు

(మొదటి పేజీ తరువాయి..) ట్వీట్‌లో పేర్కొన్నారు. మరి శ్రీలంక పవన విద్యుత్ కాంట్రాక్టుల్లో ప్రధాని మోదీ జోక్యం ఉందని ఆ దేశ సీనియర్ అధికారులే ఆరోపిస్తున్నారు. మరి దీనిపై ప్రధాని మోదీ, అదానీ ఎందుకు స్పందించడం లేదు? అని కేటీఆర్ ప్రశ్నించారు.

### కాళేశ్వరంతో వ్యవసాయానికి ఊపు: వినోద్




**సిద్దిపేట, జూన్ 15 (సమ సమాజం):**కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో వ్యవసాయానికి ఊతం వచ్చిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ పేర్కొన్నారు. గురువారం కోహెడ మండలంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ సస్యశ్యామలం అవుతోందన్నారు.గౌరవెల్లి ప్రాజెక్టుతో లక్షా 60 వేల ఎకరాలకు త్వరలో గోదావరి నీళు అందనున్నాయని చెప్పారు. భూనిర్వాసితులకు నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందన్నారు.కానీ ప్రతిపక్ష పార్టీలు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన ఆరోపించారు.ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద అందించాల్సిన పరిహారం కేవలం 2.18 శాతం మాత్రమేనని చెప్తూ ఇప్పటి వరకూ 97.82 శాతం చెల్లింపు జరిపామన్నారు.

## యూపి బుల్‌డోజర్ కూల్చివేతలపై జోక్యం చేసుకోం

**చట్టబద్ధంగా కూల్చివేతలు ఉండాలి**

**పిటిషన్‌పై విచరణలో సుప్రీం స్పష్టీకరణ**

**నివేదిక సమర్పించాలని యూపి సర్కార్‌కు ఆదేశం**



**న్యూఢిల్లీ, జూన్ 15 (సమ సమాజం):** బుల్డోజర్లతో యూపీ ప్రభుత్వం చేపట్టిన కూల్చివేతలపై సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధంగా కూల్చివేతల చర్యలు ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బుల్డోజర్లతో ఆక్రమణల కూల్చివేతపై యూపీ ప్రభుత్వం మూడు రోజుల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది. యూపీ ప్రభుత్వం ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని వారి ఆస్తులను నేలమట్టం చేస్తోందని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. కూల్చివేతకు ముందు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని పిటిషనర్లు ఆరోపించారు. చట్టబద్ధ పక్రియను అనుసరించకుండా ఇక ముందు కూల్చివేతలు చేపట్టరాదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని జమైతే ఉలేమా హింద్ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. చట్ట నిబంధనలకు లోబడే కూల్చివేత డ్రైవ్‌ను చేపట్టామని, బుల్డోజర్లతో ఆక్రమణలను కూల్చివేసే ముందు నోటీసులు జారీ చేయలేదని పిటిషనర్ ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. అయితే తాము యూపీ ప్రభుత్వ చర్యలను నిలిపి వేయాలని కోరడం లేదని, ఎలాంటి చర్యలైనా చట్ట పరిధిలో ఉండాలని సుప్రీంకోర్టు పేర్కొంది. తమ అభ్యంతరాలను తెలిపేందుకు ప్రభుత్వానికి సమయం ఇస్తామని, ఆలోగా పిటిషనర్ల భద్రతనూ తాము కాపాడాలని తెలిపింది. వారు (పిటిషనర్లు) కూడా సమాజంలో అంతర్భాగమని స్పష్టం చేసింది. కూల్చివేతలు చట్ట పరిధిలో సాగాలని నొక్కిచెప్పిన కోర్టు విచారణను మరుసటి వారానికి వాయిదా వేసింది. ఇక సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపిస్తూ జహంగిర్‌పురిలో ఆస్తుల యజమానులు ఏ వర్గం వారు అని చూడకుండా అలాంటి కట్టడాలను ప్రభుత్వం కూల్చివేసిందని గుర్తుచేశారు.

## బాసరలో కొనసాగుతున్న ఆందోళన

(మొదటి పేజీ తరువాయి..) డిమాండ్లతో విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. ఎనిమిది వేల మంది విద్యార్థులంతా తరగతులను బహిష్కరించి వర్సిటీలో నెలకొన్న సమస్యలపై గొంతెత్తారు. వర్సిటీ ప్రధాన గేటు వద్ద రోజంతా బైఠాయించి ఆందోళన నిర్వహించారు. వర్షంలో తడుస్తూనే కదలకుండా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తంచేశారు. సీఎం కేసీఆర్ వర్సిటీకి వచ్చి.. సమస్యలు పరిష్కరించేదాక ఆందోళన ఆపబోమని స్పష్టంచేశారు. సోషల్ మీడియా వేదికగానూ వేల మంది విద్యార్థులు తమ నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చినా.. వైస్ చాన్సలర్‌తో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోనున్నట్లు విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించినా విద్యార్థులు మాత్రం పట్టు వీడటం లేదు. మాటలు చెప్పొద్దని.. తమ సమస్యలకు పరిష్కారం చూపాలని సోషల్ మీడియా వేదికగా మంత్రులకు విద్యార్థులు ఘాటైన సమాధానాలిచ్చారు. మూడోరోజూ ఆందోళనతో బాసర ట్రిపుల్ ఐటీ దగ్గర ఉద్రిక్తత కొనసాగుతోంది. ఖాళీ వాటర్ బాటిల్స్ తో విద్యార్థులు నిరసనకు దిగారు. అయితే మెయిన్ గైట్ వైపు విద్యార్థులు రాకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు విద్యార్థులకు మద్దతుగా వస్తున్న తల్లిదండ్రులు సహా నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంకోవైపు విద్యార్థుల ధర్నాకు మద్దతు తెలిపేందుకు వచ్చిన తెలంగాణ జనసమితి నేత చీఫ్ కోదండరాంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమ డిమాండ్లు నెరవేరుస్తామని ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చేవరకు నిరసనలు కొనసాగిస్తామని విద్యార్థులు తేల్చిచెప్పారు. విద్యార్థులకు మద్దుతు తెలిపేందుకు వస్తున్న నేతల్ని ఎక్కడిక్కడ అడ్డుకుంటున్నారు. దీంతో ట్రిపుల్ ఐటీ దగ్గర గందగోళ పరిస్థితి నెలకొంది. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆందోళనకు బీజేపీ పూర్తి మద్ధతు ఇస్తుందని ఎంపీ సోయం బాపురావు అన్నారు. బాసరలో అరకొర వసతులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో విద్యార్థుల సమస్యలు ఎదుర్కొం టున్నాని..సర్కార్ వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇదిలావుంటే బాసరలో ఆందోళన చేస్తున్న విద్యార్థులకు అధికారులు తాగునీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో నీరు లేక విద్యార్థులు ఇబ్బందులకు లోనవుతున్నారు. ఈ విధంగా తమపై ఒత్తిడి తెస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మా క్యాంపస్ ఎస్పీ కంట్రోల్‌లో ఉంది...తాగునీరు, విద్యుత్ సౌకర్యం పునరుద్దరించాలని విద్యార్థులు ట్వీట్ చేశారు. మరోవైపు బాసర ఆర్జీయూకేటి( ట్రిపుల్ ఐటి) మెయిన్ గేటు వద్ద విద్యార్థుల ఆందోళన కొనసాగుతోంది. విద్యార్థులు గేటు వైపు దూసుకురాకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. బారికేడ్లను ఏర్పాటు చేశారు. 12 డిమాండ్లతో గత మూడు రోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే.

## జెడ్పీటీసీని పరామర్శించిన మెదక్ జెడ్పీ చైర్ పర్సన్ హేమలత శేఖర్ గౌడ్



**టేక్మాల్, జూన్ 15 (సమ సమాజం):** అందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండల జెడ్పీటీసీ సర్వని సరోజ భర్త ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన సర్వని మల్లేశం చిత్రపటానికి మెదక్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హెమలత శేఖర్ గౌడ్ గారు నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులని పరామర్శించి వారిని ఓదార్చారు. మనో ధైర్యంతో ఉండాలని వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ శైలేష్ కుమార్, నాయకులు రవి యాదవ్, రజాక్ కొట్టి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మరుల కుల వృత్తుల సంఘం నూతన మండల కమిటీ ఏర్పాటు

### కుమ్మరులను గుర్తించాలి ఆడాల గణేష్




**కందుకూరు, జూన్ 15 (సమ సమాజం):** రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం కేంద్రంలో కుమ్మర సంఘం నూతన కమిటీ ఏర్పాటు చేయడమైనది .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎగిరి శెట్టి వీరయ్య ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కుమ్మరుల కు వృత్తుల కోసం ప్రభుత్వం చేతి పనిముట్లను విద్యుత్ పరికరాలను(సారే లను) అందజేసే విధంగా కృషి చేసిందని ఇంకా వచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం రంగారెడ్డి జిల్లా కుమ్మరి సంఘం యూత్ అధ్యక్షుడు ఆడాల గణేష్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కుల వృత్తుల అధ్యక్షుడు మోహన్ కుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పాటు చేయడమైనది కమిటీ సభ్యులు కందుకూరు మండల కమిటీ ఎన్నికైన బొడ్డుపల్లి రవి, కందుకూరు యూత్ అధ్యక్షుడు కుమ్మరి నరేష్, కందుకూర్ కుమ్మరి సంఘం ఎగిరి శెట్టి బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు. నా మీద నమ్మకంతో మండల అధ్యక్షుడిగా పదవి కట్టబెట్టినందుకు నియమ నిబంధనలతో పని చేస్తానని కుమ్మరి సంఘం పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

## దేశంలో శాంతి

### సామరస్యం పరిఢవిల్లాలని ప్రార్థించండి

హజ్ యాత్రికులకు లగేజ్ బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్



**కరీంనగర్, జూన్ 15 (సమ సమాజం):** దేశంలో, రాష్ట్రంలో శాంతి, సామరస్యం పరిఢవిల్లాలని, తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాహ్ ను ప్రార్థించాలని తెలంగాణ హజ్ కమీటీ సభ్యులు..ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ హజ్ యాత్రికులను కోరారు. గురువారం నగరంలోని ఎంఐఎం కార్యాలయంలో తెలంగాణ హజ్ కమీటీ ద్వారా 2022 సంవత్సరానికి పవిత్ర హజ్ యాత్రకు వెళుతున్న కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన యాత్రికులకు గులాం అహ్మద్ హుస్సేన్, మరో హజ్ కమిటీ సభ్యుడు ఇర్ఫాన్ ఉల్ హఖ్ తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ తెలంగాణ హజ్ కమిటీ దేశంలోనే అత్యుత్తమ సేవలను అందిస్తోందన్నారు. బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ, సీఎం కేసీఆర్ ల ప్రత్యేక చొరవతో హజ్ యాత్రికులకు సేవ చేసే భాగ్యం లభించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. తమ నియమాలను పాటిస్తూ, షెడ్యూల్ ప్రకారం యాత్రికులు దిగ్విజయంగా హజ్ యాత్ర చేసి, క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హఫీజ్ షఫీయుద్దీన్ ఎజాస్, హాఫిజ్ మొయిజుద్దీన్ ఖాద్రి, సదర్ ఖాజీ మంఖబత్ శాఖాన్, హఫీజ్ వసిముద్దీన్, కార్పొరేటర్లు శర్ఫుద్దీన్, అఖీల్ ఫిరోజ్, నాయకులు అజర్ దబీర్, ఖమరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ చౌక్లో జాతీయ జెండా తిరిగి ఏర్పాటు చేయకపోవడం రాజ్యాంగ విరుద్ధం



- కార్పొరేషన్ అధికారులు జాతీయ జెండా వెంటనే ఏర్పాటు చేయాలి
- కేంద్రం వేల కోట్ల స్మార్ట్ సిటీ నిధులు కేటాయిస్తున్న సరైన ప్రణాళిక లేక డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- మంత్రి గంగుల మేయర్ సునీల్ రావు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టి డ్రైనేజీ వ్యవస్థ పటిష్టం చేయాలి...
- బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్లెం వాసుదేవ రెడ్డి..

**కరీంనగర్, జూన్ 15 (సమ సమాజం):** కరీంనగర్ ఆర్ట్స్ కాలేజీ లో నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన జాతీయ పతాకం చిరిగిపోతే దాని స్థానంలో కొత్త పతాకాన్ని ఏర్పాటు చేయకపోవడం రాజ్యాంగ విరుద్ధమని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్లెం వాసుదేవ రెడ్డి అన్నారు. భారతీయ జనతాపార్టీ కరీంనగర్ నగర జోన్ల శాఖల ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్లో నూతన జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేయాలని, నగరంలో డ్రైనేజీ వ్యవస్థ పునర్వ్యవస్థీకరించాలని చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కరీంనగర్ నగరం నడిబొడ్డున నగరపాలక సంస్థ ఏర్పాటుచేసిన జాతీయ పతాకం తొలగించడం రాజ్యాంగ విరుద్ధం, కొత్త జాతీయ పతాకాన్ని కొనలేని స్థితిలో నగరపాలక సంస్థ ఉందా అని మేయర్ సునీల్ రావును ఆయన ప్రశ్నించారు. మేయర్ వెంటనే స్పందించి కొత్త జెండా ఏర్పాటు చేయాలని లేనియెడల బిజెపి తీవ్రంగా ఉద్యమిస్తుంది అని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు కరీంనగర్ స్మార్ట్ సిటీ అభివృద్ధి కొరకు కేటాయిస్తే కమీషన్లకు కక్కుర్తిపడి నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారు చేశారు అని అన్నారు. సరైన ప్రణాళిక లేని కారణంగా నగరంలో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది అని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేని కారణంగా నాలాలు ఉప్పొంగి వర్షం నీళ్ళు ఇండ్లలోకి వస్తున్నాయి అని అన్నారు. ఇప్పటికైనా మంత్రి గంగుల, మేయర్ సునీల్ రావు డ్రైనేజీ వ్యవస్థ పై దృష్టి సారించి నగరంలో డ్రైనేజీ పునర్వ్యవస్థీకరణ చేపట్టకపోతే బిజెపి ప్రజల పక్షాన తీవ్రంగా ఉద్యమిస్తుంది అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, జిల్లా కోశాధికారి వై ద రామానుజం, బల్బీర్ సింగ్, జాడి బాల్ రెడ్డి, చొప్పరి జయశ్రీ, దుబాల శ్రీనివాస్, కూర మహిపాల్ రెడ్డి, మామిడి చైతన్య, రాగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## దుకాణాలను చైతన్యపురి కూరగాయల షెడ్ లోకి తరలించండి

### అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్



**కరీంనగర్, జూన్ 15 (సమ సమాజం):** నగరంలోని రోడ్లు, ఫుట్ పాత్ లపై వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు వాటిని తొలగించాలని వ్యాపారులను అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్ సూచించారు. గురువారం అదనపు కలెక్టర్ కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాల ముందు రోడ్లపై, ఫుట్ పాత్ లపై కూరగాయలు, పండ్లు అమ్ముతున్న వ్యాపారులను కలసి తమ యొక్క కూరగాయల దుకాణాలను రోడ్లు, ఫుట్పాత్లపై నుండి తొలగించి చైతన్యపురిలోని కూరగాయల షెడ్లోకి తరలించాలని వ్యాపారులు ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ సేవా ఇస్లావత్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీందర్, డిసిపి సుభాష్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## యోగ డే ను జయప్రదం చేయండి



### అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్

ప్రతినిత్యం యోగా చేయడం వల్ల మానసిక, శారీరక రుగ్మతలకు దూరం

**కరీంనగర్, జూన్ 15 (సమ సమాజం):** ఈనెల 21న కరీంనగర్ లో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పిలుపునిచ్చారు. గురువారం అంతర్జాతీయ యోగా దినోత్సవం లో భాగంగా ఆయుష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభయాత్రను జ్యోతిబాపులే పార్కు వద్ద ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నిత్యం యోగా చేయడం ద్వారా మానసిక శారీరక రుగ్మతలు దూరం అవుతాయని పేర్కొన్నారు. యోగాపై విస్తృత ప్రచారం చేయాని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ జువేరియా, ఆర్ డిడి రవి నాయక్, డిపిఒ రవీందర్, నేచురోపతి మెడకల్ ఆఫీసర్ పి.రజిత, మెడికల్ ఆఫీసర్లు యస్రుబ్ సుల్తాన, విశ్వంబర్, ఆర్ వెంకటేశ్వర్, యువభారత్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల రమేష్, ఆయుర్వేద, యునాని, హెూమియోపతి, నాచురోపతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంధిలా రూట్ గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



**ఆందోల్, జూన్ 15 (సమ సమాజం):** మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండల పరిధిలోని సందిల రూట్ లో సుడిగాలి పర్యటన చేసిన ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్. మండలంలోని షాబాద్, ఏల్లుపెట, వేల్పుగొండ, సూరంపల్లి, సీఎం తండా, బోడగట్టు, కమ్మరికత్త , ఎల్లంపల్లి, గ్రామాలలో మన ఊరు మన బడి మరియు సిసి రోడ్లు పలు భవనలకు పలు అభివృద్ధి పనుల నిర్మాణానలకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేయడం జరిగింది. పలు గ్రామాలలో ఎమ్మెల్యే గారికి డప్పు మేళాలతో టపాసులతో ఘన స్వాగతం పలకడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా గ్రామాల దశలవారీగా అభివృద్ధి చేయడమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా గ్రామాలు అభివృద్ధి చెందాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. వెలుగొండ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ ప్రేమ్ కుమార్ గ్రామ ప్రవేశ మార్గంలో ఎమ్మెల్యే గారిని ఆపి మా గ్రామంలో పెద్ద చెరువు కట్ట మరమ్మతులకు నిధులు కేటాయించాలని. అలాగే చిన్నం కుంట, అబ్బని కుంట, అంధ్యల కుంట, లలో మిషన్ కాకతీయ పనులలో భాగంగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ఆగిపోవడం జరిగిందని, ఇట్టి సమస్యకు పరిష్కారించలని,మరియు ప్రభుత్వ పశు వైద్యశాల ఎనిమిది సంవత్సరాలుగా మూతపడి ఉన్నది డాక్టర్ డాక్టర్ ను నియమించాలి మరియు ఆరోగ్య ఉప కేంద్రం నుండి ఒక చెరువు టేక్ మాల్ రోడ్ వరకు రహదారిని ఏర్పాటు చేయాలని అలాగే గత ఆరు సంవత్సరాలుగా ఆయుర్వేదిక్ డాక్టర్ లేకపోవడం వలన గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు అని చెప్పేసి డాక్టర్ నియమించాలనిలి(NRIGES) మొదటి విడతలో భాగంగా నిధులు కేటాయించినా నిమ్మకు నీరెత్తినట్లు కాంట్రాక్టర్లు పట్టించుకోక పోవడం వలన అతను వినతి పత్రం అందజేయడం జరిగింది. ఇటీవల నారాయణఖేడ్ లో జరిగిన బసవేశ్వర సంగమేశ్వర ఎత్తిపోతల పథకం శంకుస్థాపన బహిరంగ సభకు టేక్మాల్ మండలం లోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన కొండి లింగమయ్య సభకు వెళ్తున్న సమయంలో గుండెపోటుతో చనిపోవడం జరిగింది. అతను టిఆర్ఎస్ పార్టీ కార్యకర్త అయినందున లింగమయ్య కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు అందజేయడం జరిగింది. అలాగే అచ్చన్న పల్లి గ్రామానికి చెందిన మహేందర్ గత కొద్ది కాలం క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించారు వీరి కుటుంబ సభ్యులకు కూడా రెండు లక్షల రూపాయల చెక్కును అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మెదక్ జిల్లా పరిషత్ చైర్మన్ హేమలత శేఖర్ గౌడ్, గారికి ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ గారికి ఘనంగా శాలువాలతో పూలమాలలతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యులు యూసుఫ్, ఎంపీపీ చింత స్వప్న రవి, మండల తెరాస పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప ప్రధాన కార్యదర్శి అవినాష్ కుమార్, పలు గ్రామాల సర్పంచులు ఉప సర్పంచులు ఎంపిటిసిలు, తెరాస పార్టీ అధ్యక్షులు తెరాస పార్టీ గ్రామ పాలకవర్గ సభ్యులు పలు పాఠశాలల ఉపాధ్యాయులు తెరాస పార్టీ కార్యకర్తలు మహిళలు ఉన్నారు

## భూసేకరణ పూర్తి కాకుండానే వెట్‌రన్‌కు యత్నాలు



- తమకు పూర్తి పరిహారం అందలేదంటున్న నిర్వాసితులు
- అధికారుల పట్టుదలతో బాధిత రైతుల్లో ఆందోళన
- గౌరవెల్లి ఘటన వెనక దాగిన నిజాలు ఎన్నో

సిద్దిపేట,జూన్16(ఆర్ఎన్ఎ): గౌరవెల్లి భూ నిర్వాసితులకు న్యాయం చేయడం కన్నా అక్కడ ట్రయల్ రన్ నిర్వహించాలన్న పట్టుదలే ప్రధానంగా కనిపిస్తోంది. స్వయంగా మంత్రి హరీష్ రావు కూడా ఈ విషయం ప్రస్తావించారు. ఎక్కడి నుంచో తెప్పించిన మోటర్లకు వారెంటీ అయిపోక ముందే వాటిని ఉపయోగించాల్సి ఉందన్నారు. ఈ క్రమంలోనే గౌరవెల్లి ప్రాజెక్టు భూనిర్వాసితులు నష్టపరిహారం కోసం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. సోమవారం తెల్లవారుజామున 3.30 గంటలకు పోలీసులు గ్రామాన్ని చుట్టుముట్టడం.. విద్యుత్ సరఫరా నిలిపివేసి, పలువురిని అరెస్టు చేయడం.. నిర్వాసితులకు, పోలీసులకు మధ్య తోపులాట.. పోలీసుల లాఠీచార్జీతో తీవ్ర నిరసన వ్యక్తమైంది. దీనితో నిర్వాసితులు ఆందోళనను మరింత ముమ్మరం చేశారు. గౌరవెల్లి భూ నిర్వాసితులతో ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు జరిపిన చర్చలు సఫలమయ్యాయి. బుధవారం మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మెట్టుబండల వద్ద మంత్రి హరీశ్‌రావు సమక్షంలో భూనిర్వాసితుల తో ప్రశాంత వాతావరణంలో చర్చలు జరిపారు.ఈ సందర్భంగా చర్చలకు వచ్చిన భూ నిర్వాసితులను మంత్రి సాదరంగా ఆహ్వానించారు. దాదాపు గంటసేపు నిర్వాసితుల డిమాండ్లను విన్న మంత్రి హరీశ్‌రావు.. సానుకూలంగా స్పందించి, తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రిజర్వాయర్ కోసం చైనా నుంచి మోటర్లు తెప్పించామని, మూడేండ్ల వరకు వాటికి వారంటీ ఉంటుందని, ఈ లోపు వెట్ రన్ నిర్వహించా లని, లేదంటే వారంటీ అయిపోయాక సమస్య వస్తే రాష్ట్ర ప్రభుత్వంపై కోట్ల భారం పడుతుందని వివరించారు. అందుకోసం సర్వే పనులు త్వరగా పూర్తి చేసేందుకు ఇంజినీర్లు, సిబ్బందిని గౌరవెల్లికి పంపగా, కొందరు అక్కడకు పోయి వారిని అడ్డుకొనే ప్రయత్నం చేశారని, అందుకే పోలీసులు అక్కడకు వెళ్లారని అన్నారు. కుడికాల్వ 45 కిలోమీటర్లు, ఎడమ కాల్వ 11 కిలోమీటర్లు పూర్తయిందని తెలిపారు. కాల్వలు పారితే చెరువులు, బావులు, కుంటలు నిండి జనం బతుకుతారని అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ కోసం 816 ఎకరాల భూసేకరణ పూర్తయ్యిందని, కేవలం 84 ఎకరాల భూమి సేకరణ జరగలేదని, వాళ్లు కోర్టుకు వెళ్తే వారి పరిహారం కోర్టులో డిపాజిట్ చేస్తామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. 97.82 శాతం భూసేకరణ జరిగిందని అన్నారు.రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా గౌరవెల్లి నిర్వాసితులకు ఎకరానికి రూ.15 లక్షల పరిహారం ఇస్తున్నామని, భూసేకరణలో భాగంగా ఇప్పటికే రూ.200 కోట్లు చెల్లించామని వివరించారు. నిర్వాసితుల పరిధిలో 693 ఇండ్లు ఉండగా, అందులో 2015లో 683 ఇండ్లకు రూ.83 కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు. ఆర్అండ్ఆర్ కింద 937 కుటుంబాలను గుర్తించామని, ఇందులో 927 కుటుంబాలకు రూ.74.88 కోట్లు చెల్లించినట్టు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజక వర్గంలోని అక్కన్నపేట మండలం గూడాటిపల్లిలో 8.23 టీఎంసీల సామర్థ్యంతో గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టింది. ప్రాజెక్టు కాల్వ నిర్మాణం కోసం సర్వే పనులు జరుగు తున్నాయి. అయితే తమకు పూర్తి పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలంటూ నిర్వాసితులు రెండు రోజులుగా పనులను అడ్డుకుం టున్నారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున 3.30 గంటలకు పోలీసులు గూడాటిపల్లిలో మోహరించారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి ఇళ్లలోని నిర్వాసితు లను అరెస్ట్ చేయడం మొదలుపెట్టారు. మహిళలు, కుటుంబ సభ్యులు పోలీసులను అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు లాఠీచార్జ్‌కి దిగి చెదరగొట్టడంతో.. పలువురికి గాయాలయ్యాయి. అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వాసితులు గూడాటిపల్లి నుంచి హుస్నాబాద్ వరకు పాదయాత్ర చేపట్టారు. హుస్నాబాద్ ఎల్లమ్మ గుడివద్ద పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడే బైఠాయించి ఆందోళనకు దిగారు. అధికారులు దిగివచ్చి అనుమతి ఇవ్వడంతో నిర్వాసితులు ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి నిర్వాసితులతో మాట్లాడారు. అరెస్టైన వారిని విడుదల చేయించారు. పోలీసులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయినా నిర్వాసితులు వెనక్కి తగ్గలేదు. హుస్నాబాద్ పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాస్తారోకో, వంటావార్పు నిరసన చేపట్టారు. అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. పోలీసుల లాఠీచార్జీని నిరసిస్తూ కాంగ్రెస్ మంగళవారం హుస్నాబాద్ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చింది. అయితే ప్రభుత్వం భూమికి బదులు భూమి ఇవ్వాలని కోరుతున్నారు.. మల్లన్నసాగర్ నిర్వాసితులతో సమానంగా నష్టపరిహారం చెల్లించాలన్నారు. భూ నిర్వాసితుల ఆందోళనలతో హుస్నాబాద్ పట్టణం రెండురోజులుగా అట్టుడికింది. లాఠీచార్జి జరిపిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, న్యాయమైన పరిహారం అందించాలని గౌరవెల్లి రిజర్వాయర్ భూ నిర్వాసితులైన గుడాటిపల్లి గ్రామస్థులు మంగళవారం కూడా ఆందోళన చేపట్టారు. నిర్వాసితులకు పోటీగా ప్రాజెక్టును పూర్తిచేయాలని టీఆర్ఎస్ నాయకులు ర్యాలీకి పూనుకోవడం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది.

## ఆందోళన విరమించండి

### బాసర విద్యార్థులకు సబిత ట్వీట్



హైదరాబాద్,జూన్16(ఆర్ఎన్ఎ): బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆందోళనపై రాష్ట్ర ప్రభుత్వంలో కదలిక ఏర్పడింది. జోరుగా వర్షం పడుతున్నా లెక్క చేయకుండా విద్యార్థులు నిరసన కొనసాగించడం.. గవర్నర్ సహా ప్రతిపక్షాలు విమర్శించడం.. విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తుండడం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచింది. ఈ నేపథ్యంలో ఇంచార్జ్ వీసీతో పాటు.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, హోం మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే విఠల్ రెడ్డి తదితరులతో మంత్రి సబితా ఇంద్రారెడ్డి పరిస్థితి సమీక్షించారు. అనంతరం విద్యార్థులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలపై సమావేశంలో చర్చించామని.. వాటి పరిష్కారం పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆమె ట్వీట్ చేశారు. విద్యార్థులు వెంటనే ఆందోళన విరమించాలని మంత్రి సబితా ట్విట్టర్ ద్వారా విజ్ఞప్తి చేశారు.




# చలన చిత్రం

## హిందీలోకి రీమేక్ కాబోతున్న సూరారై పోట్రు



రెమ్యునరేషన్ ను కాకుండా... కేవలం కథను చూసి సినిమా ఓకే చేసే గొప్ప నటుల్లో ముందుంటారు తెలుగు, తమిళ నటుడు సూర్య. తన పాత్ర ఇలా ఉంటేనే చేస్తానన్న హద్దులు పెట్టుకోకుండా.. ఏ పాత్రనైనా జీవించి చేయడంలో ఆయన దిట్ట. కథ బాగుంటే అది రెండు, మూడు నిమిషాల నిడివి ఉన్న పాత్రైనా సరే చేస్తాననే స్వభావం ఉన్న సూర్య వ్యక్తిత్వం... ఇటీవల కమల్ హాసన్ నటించిన విక్రమ్ సినిమాతో తేటతెల్లం అయింది. ఆ మూవీలో సూర్య చేసిన రోలెక్స్ క్యారెక్టర్ మొత్తం సినిమాకే హైలెట్ గా నిలిచిందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. అందులో చేసింది జస్ట్ గెస్ట్ అప్పియరెన్సే అయినా.. ఆయన నటనకు, ఆ క్యారెక్టర్ కు అభిమానులు వంద శాతం మార్కులిచ్చేశారు. ఇకపోతే కోలీవుడ్ స్టార్ సూర్య నటించిన సూరరై పొట్రు సినిమా అప్పట్లో వివిధ భాషల్లో విడుదలై ఎంత సక్సెస్ ను నమోదు చేసిందో అందరికీ తెలిసిందే. ఆ మూవీనే తెలుగులో ఆకాశమే సరిహద్దురా అనే టైటిల్ తో విడుదలైంది. లాక్ డౌన్ సమయంలో రిలీజ్ అయిన ఈ చిత్రానికి తెలుగులోనూ భారీ రెస్పాన్స్ వచ్చింది. అత్యధిక వ్యూస్ సాధించిన బెస్ట్ ఫిల్మ్ గా నిలిచిపోయింది. అయితే ఎయిర్ డెక్కన్ వ్యవస్థాపకుడు కెప్టెన్ జి.ఆర్. గోపీనాథ్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని ఇప్పుడు హిందీలోనూ రీమేక్ చేయబోతున్నారు. ఈ మూవీతో బాలీవుడ్ లో అడుగుపెట్టిన సూర్య... తనతో పాటు నటుడు అక్షయ్ కుమార్ కూడా ఓ లీడ్ రోల్ లో కనిపించబోతున్నారని.. ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయనతో కలిసి ఉన్న ఓ పిక్ ను కూడా జత చేశారు.

## ఒక్క అడుగు .. వేయలేకపోతున్న ప్రభాస్

### ఏళ్లుగా నానుతున్న కృష్ణంరాజు ప్రాజెక్ట్



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియన్ సినిమాలతో బిజీ గా ఉన్నారు. ప్రభాస్ హీరోగా రెబల్ స్టార్ కృష్ణంరాజు 'ఒక్క అడుగు' సినిమాని ప్రతిష్టాత్మకంగా తన సొంత బ్యానర్ అయిన గోపీకృష్ణ మూవీస్‌పై నిర్మించాలని ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. 'బాహుబలి' సినిమా కన్నా ముందునుంచే ఈ ప్రాజెక్ట్ గురించి రెబల్ స్టార్ ఫాన్స్ లో చర్చ జరుగుతూనే ఉంది. బాహుబలి అయిపోయి ఏళ్లు గడుస్తున్నా కానీ 'ఒక్క అడుగు' తప్రాజెక్ట్ ఇప్పటివరకూ పట్టాలెక్కింది లేదు. ప్రభాస్ వేర్వేరు సినిమాలకు కాల్షీట్లు కేటాయిస్తున్నాడు తప్ప.. పెదనాన్న రాసిన సినిమాకి మాత్రం కేటాయంచట్లేదు.నాలుగేళ్ల క్రితం కృష్ణంరాజు ఈ ప్రాజెక్ట్ డీటైల్స్ వెల్లడించారు. ప్రభాస్ కటౌట్‌కు అదిరిపోయే స్క్రిప్ట్ అని...ఒక మంచి మెసేజ్‌తో కూడుకున్న సినిమా అవుతుందని...'ఒక్క అడుగు'.. ప్రభాస్ వెయ్యి అడుగుల వేసేలా ఇన్‌స్పైర్ చేసే స్క్రిప్ట్ అని చెప్పారు. కృష్ణం రాజు స్వయంగా ఈ కథను సిద్ధం చేసుకున్నట్లు కూడా వెల్లడించారు. మీరే డైరెక్ట్ చేయొచ్చు కదా..అని ప్రశ్నించగా? అది నేను చేయాల్సిన సినిమా కాదు...పూరి జగన్నాథ్లాంటి వాళ్లు చేయాల్సిన పవర్ ఫుల్ స్క్రిప్ట్.. అని పూరి పేరు రివీల్ చేసారు రెబల్ స్టార్. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో ఎనిమిది సినిమాలు ఉన్నాయి. సో ఇప్పట్లో ఒక్క అడుగు మాట కూడా వినిపించడం కష్టం అనుకుంటున్న టైములో షాకింగ్ న్యూస్ బయటకి వచ్చింది. 'ఒక్క అడుగు' సినిమా గురించి మరోసారి కృష్ణంరాజు ప్రభాస్ వద్ద చర్చించారట. అందుకు ప్రభాస్ తప్పకుండా చేద్దామని పెదనాన్నకి ప్రామిస్ చేసినట్లు సమాచారం. పూరి, డార్లింగ్ ర్యాపో గురించి చెప్పాల్సిన పనిలేదు. ఈ ప్రాజెక్ట్‌ను పూరి టేకప్ చేసి పాన్ ఇండియన్ లెవెల్‌లో తెరకేకించిన ఆశ్చర్యం లేదు. అయితే 'టెంపర్' మినహా, పూరి ఇప్పటివరకు ఇతర రైటర్ల కథల్ని తీసుకున్న సందర్భం లేదు. రీమేక్‌లు కూడా చాలా అరుదు. అయితే, ఇక్కడ కథ రాసింది రెబల్ స్టార్, యాక్ట్ చేయనుంది యంగ్ రెబల్ స్టార్.. కాబట్టి పూరి టేకప్ చేసే ఛాన్స్ కనిపిస్తుంది. ఇక పూరి – ప్రభాస్ కాంబినేషన్‌లో ఇంతకముందు 'ఏక్ నిరంజన్', 'బుజ్జిగాడు' చిత్రాలొచ్చిన సంగతి తెలిసిందే.

## అంటే సుందరానికి పాజిటివ్ రెస్పాన్స్

### కలెక్షన్లు అంతంత మాత్రమే




నాని, నజ్రియా ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'అంటే సుందరానికీ' గత శుక్రవారం విడుదలై పాజిటీవ్ రివ్యూలను తెచ్చుకుంది. కానీ కలెక్షన్లలో మాత్రం ఎలాంటి జోరు చూపించలేకపోతుంది. నాని గత సినిమాలను పోల్చితే ఈ చిత్రం లోయెస్ట్ ఓపెనింగ్స్‌ను తీసుకువచ్చింది. ఇప్పటి వరకు ఈ చిత్రం కేవలం 60శాతం కలెక్షన్లను మాత్రమే సాధించింది. ఇక ఈ వారం 'విరాటపర్వం' విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సినిమాపై తెలుగు రాష్ట్రాల్లో బాగా హైప్ ఉంది. ఈ చిత్రానికి పాజిటీవ్ టాక్ గనుక వస్తే అంటే సుందరానికీ సినిమాకు బ్రేకులు పడ్డట్టే. కలెక్షన్ల విషయం పక్కన పెడితే ఈ చిత్రంలో నాని, నజ్రియాల నటన వర్ణనాతీతం. ఫస్ట్ ఫ్రేమ్ నుండి లాస్ట్ ఫ్రేమ్ వరకు వీళ్ళ సన్నివేశాలు ఎక్కడా కూడా బోర్ కొట్టవు. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా నుండి 'ఎంత చిత్రం' అనే వీడియో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటలో నాని, నజ్రియా మధ్య కెమిస్ట్రీని దర్శకుడు అద్భుతంగా చూపించాడు. వివేక్ సాగర్ సంగీతం మంచి ఫీల్‌ను కలిగిస్తుంది. నికేత్ బొమ్మి విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. లేటెస్ట్‌గా విడుదలైన ఈ పాట శ్రోతలను విపరీతంగా ఆకట్టుకుంటుంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, రవిశంకర్ నిర్మించారు. కాగా నాని సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తున్న బాక్సాఫీస్ దగ్గర మాత్రం భారీ కలెక్షన్లను రాబట్టలేకపోతున్నాయి. నాని గత నాలుగైదు చిత్రాలు కూడా బాక్సాఫీస్ దగ్గర అంతగా రాణించలేకపోయాయి. ఈ విషయంలో నాని కాస్త ఆలోచించాలని నెటీజన్లు అభిప్రాయపడుతున్నారు. నాని కథల ఎంపిక, డైరెక్టర్‌ల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని కామెంట్స్ చేస్తున్నారు.

## థాంక్యూతో వస్తోన్న నాగచైతన్య





అక్కినేని నటవారసుడిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి.. తన నటన, అభినయంతో ప్రేక్షకులలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు అక్కినేని నాగచైతన్య. 'లవ్‌స్టోరీ', 'బంగార్రాజు' వంటి వరుస హిట్లతో జోరుమీదున్న చైతన్య హ్యాట్రిక్ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఈయన నటించిన 'థాంక్యూ' విడుదలకు సిద్ధంగా ఉంది. విక్రమ్ కే కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం జూలై 8న విడుదల కానుంది. ఈ క్రమంలో చిత్రబృందం వరుస అప్‌డేట్‌లను ప్రకటిస్తూ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నారు. తాజాగా మేకర్స్ మరో అప్‌డేట్‌ను ప్రకటించారు. ఈ చిత్రంలోని 'ఏంటో ఏంటోంటో' అంటూ సాగే మెలోడియస్ సాంగ్‌ను విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. అనంత శ్రీరామ్ సాహిత్యం అందించిన ఈ పాటను జోనిత గాంధి ఆలపించింది. ఇదివరకే చిత్రం నుంచి విడుదలైన 'మారో మారో' సాంగ్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చింది. రొమాంటిక్ కామెడీ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రంతో నాగచైతన్యకు జోడీగా రాశీఖన్నా, మాళవిక నాయర్, అవికా గోర్ హీరోయిన్‌లుగా నటించారు. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పీ.సీ శ్రీరామ్ ఛాయగ్రహకుడిగా పనిచేశాడు. శ్రీవెంకటేశ్వరా క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్‌లు నిర్మించారు.

## వరుస చిత్రాలతో జోరు మీదున్న వర్మ

### బిగ్ బితో మరో సినిమాకు ఆర్జీవి ప్లాన్



వివాదాలకు చిరునామాగా నిలిచిన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కొంతకాలంగా తెలుగులో వరుస చిత్రాల్ని వదులుతున్నారు. ఎప్పుడు ఏ సినిమా తీస్తున్నారో ఎవరికీ తెలియడం లేదు. ప్రస్తుతం 'డేంజరస్ కొండా ' సినిమాలతో పాటు మరో మూడు సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో 'కొండా' చిత్రం వచ్చే వారం విడుదల కానుండడంతో ప్రస్తుతం ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో తలమునకలై ఉన్నారు వర్మ. ఈ సందర్భంగా మీడియా ముందుకొచ్చిన వర్మ తదుపరి చిత్రాల విషయమై పలు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. తెలుగులోనే కాకుండా బాలీవుడ్ లో ఓ భారీ చిత్రం చేయబోతున్నట్టు ప్రకటించారు. బాలీవుడ్ లో వర్మకు బాగా సన్నిహితంగా ఉండే నటుడు ఎవరంటే.. అందరికీ ఠక్కున గుర్తుకొచ్చే పేరు బిగ్ బీ అమితాబ్ బచ్చన్. ఆయనతో వర్మకి మంచి అనుబంధం ఉంది. దాంతో వర్మ బాలీవుడ్ చేయబోయే భారీ చిత్రం ఆయనతోనే. అమితాబ్ బచ్చన్ తో రామ్ గోపాల్ వర్మ తీసిన 'సర్కార్' ఎంత పెద్ద హిట్టైందో తెలిసిందే. ఆ తర్వాత తీసిన 'సర్కార్‌రాజ్' పర్వాలేదని పించుకుంది. 'షోలే' చిత్రాన్ని వర్మ 'ఆగ్' పేరుతో రీమేక్ చేశారు. అందులో అమితాబ్ విలన్ గా నటించారు. ఈ సినిమా ఘోర పరాజయం పాలైంది. ఆఖరుగా వర్మ అమితాబ్ తో తీసిన 'రణ్' చిత్రం కూడా అట్టర్ ఫ్లాపైంది. మొత్తానికి వర్మ అమితాబ్ తో తీసిన నాలుగు చిత్రాల్లో రెండు సినిమాలు మాత్రమే జనాదరణ పొందాయి. ఇప్పుడు మళ్లీ పన్నెండేళ్ళ తర్వాత అమితాబ్ తో వర్మ మరో సినిమా చేయబోతుండడం ఆసక్తిగా మారింది. హారర్ జోనర్ లో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నట్టు వర్మ చెప్పారు.ఈ ఏడాది నవంబర్‌లో అమితాబ్ డేట్స్ ఇచ్చినట్టు వర్మ తెలిపారు. నవంబర్ లో సినిమాను ప్రారంభించి తక్కువ సమయంలో పూర్తి చేసి వచ్చే ఏడాది వేసవి కానుకగా విడుదల చేసేందుకు వర్మ సన్నాహాలు చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో అగ్రనటీనటులతో సినిమాలు చేయని వర్మ.. ఈ సినిమాతో మళ్ళీ పాత రామ్ గోపాల్ వర్మగా మారతారని అందరూ ఆశిస్తున్నారు. మరి బిగ్ బీ ఇచ్చిన అవకాశాన్ని వర్మ ఏ స్థాయిలో సద్వినియోగం చేసుకుంటారో చూడాలి.



## డిఫరెంట్ సినిమాలతో వస్తోన్న నయనతార

హీరోయిన్ సెంట్రిక్ సినిమాలకు కేరాఫ్ అడ్రెస్ నయనతార. ఇప్పుడున్న హీరోయిన్లలో నయనతార చేసినన్ని ఫీమేల్ సెంట్రిక్ సినిమాలను మరెవరు చేయలేరు. 'నేత్రికన్', 'అనామిక', 'కర్తవ్యం', 'మయూరి', 'కోకోకోకిల' వంటి మహిళా ప్రధాన చిత్రాలతో ఇండస్టీల్రో పత్యేక గుర్తింపు ఏర్పరచుకుంది. ప్రస్తుతం ఈమె నటించిన మరో ఫీ మేల్ సెంట్రిక్ చిత్రం 'క్ష2'. జీఎస్.విక్నేష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం థియేటర్ విడుదలను స్కిప్ చేసి నేరుగా ఓటీటీలో విడుదల కానుంది. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చింది. థ్రిల్లర్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రం జూన్ 17న ప్రముఖ ఓటీటీ సంస్థ డిస్నీ?హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ చిత్రంలో నయనతార ఎనిమిదేళ్ళ బాబుకు తల్లిగా నటించింది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ఆర్ ప్రభు ఈ చిత్రాన్ని నిర్మించారు. రిత్విక్, లీనా, మనోహర్, అడకులం మురుగదాస్ కీలకపాత్రల్లో నటించారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించిన ఈ చిత్రం తమిళంతో పాటు తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in